క్లుప్తంగా

మైనర్లను పనిలో పెట్టుకుంటే జైలుకే



దుకాణదారులకు సూచనలు చేస్తున్న అధికారులు

బేతంచెర్ల: మైనర్ల(18 ఏళ్లలోపు పిల్లలు)ను పనిలో పెట్టుకుంటే రెండేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తామని డోన్, బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు నీలిమ సంధ్య, శోభారాణి అన్నారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలోని హోటళ్లు, కిరాణ, వస్త్ర, మెడికల్, కూల్ డ్రింక్ దుకాణాలను పోలీసు, ఐసీడీఎస్, ఎడ్యుకేషనల్, సోషల్ వెల్ఫేర్ అధికారులు నాగజ్యోతి, వెంకట కృష్ణ తదితరులతో కలిసి తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుని వారి జీవితాలను నాశనం చేయొద్దని సూచించారు. వారి వెంట లీగల్ అడ్వయిజర్ సుదర్శన్, ఏఎస్ఐ వెంకట నారాయణ, సీఆర్పీ నాగేషు ఉన్నారు.

జాబ్ మేళాలో 20 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులు

డోన్ టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 20 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మొత్తం 52 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. సుప్రజిత్ ఇంజినీరింగ్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఇండియా సంస్థ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 20 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ట్రెనింగ్ ఆఫీసర్స్ ధర్మాకర్, సూర్యశేఖర్‌రెడ్డి, నాగేశవులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై డాక్టర్ అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్షలతో పాటు, హెచ్ఐవీ సోకిన వారికి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ రమణయ్య

సంజామల: గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని కానాల గ్రామంలో మంగళవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి తగాదాలు, గొడవలకు ఆస్కారం లేకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకునిరావాలని కోరారు. గ్రామంలో సారా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు.

గంగమ్మ గుడి నిర్మాణ పనుల పరిశీలన



కమిటీ సభ్యులతో డీఈ శ్రీనివాస్ ప్రసాద్

డోన్ రూరల్: మండల పరిధిలోని కొట్లవారిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న గంగమ్మ గుడిని మంగళవారం కర్నూలు ఎండోమెంట్ డీఈ శ్రీనివాస్ ప్రసాద్ పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ప్రహరీ నిర్మాణం, పూజలు తదితర వాటిపై చర్చించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి కుంభాభిషేక పూజలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట గంగపుత్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, శివయ్య, చంద్రుడు, బాబి, ప్రవీణ్, విజయ్, శ్రీరాములు ఉన్నారు.

పారుతున్న మద్యం.. అధికారుల చోద్యం

- గ్రామాల్లో బెల్ట్‌షాపుల జోరు
- నిబంధనలకు పాతరేసిన వ్యాపారులు
- ప్రార్థన మందిరం, పాఠశాల సమీపంలోనే మద్యం దుకాణాలు
- దృష్టి సారించని అధికారులు



నిబంధనలకు విరుద్ధంగా మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

కొలిమిగుండ్ల: కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి రావడంతో ప్రైవేట్ మద్యం దుకాణాల తలుపులు తెరుచుకున్నాయి.. మందు బాబులు తాగి తూలుతున్నారు. రూ.99కే మద్యం దొరుకుతుందని దుకాణాల వద్దకు వెళ్లిన మందు బాబులకు నిరాశే ఎదురవుతోంది. లాటరీలో షాపు దక్కించుకున్న వ్యక్తులు ఎక్కడైనా నిర్వహించుకోవచ్చని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్ల మండలంలో మూడు దుకాణాలు ఉన్నాయి. మూడు అధికార పార్టీ నాయకులకే లాటరీ రూపంలో వరించింది. కొలిమిగుండ్లలో రెండు దుకాణాలు, అంకిరెడ్డిపల్లెలో ఒకటి చొప్పున ప్రారంభమయ్యాయి. మద్యం దుకాణాలు తెరుచుకున్న మొదటి రోజు నుంచే పల్లెల్లో బెల్ట్ షాపుల సంఖ్య పెరిగిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెల్ట్‌లు లేకుండా కఠినంగా వ్యవహరించారు. ప్రస్తుతం ప్రతి ఊరికి బెల్ట్ షాపులు పాకుతున్నాయి. ఊర్లలో బెల్ట్ షాపుల సంఖ్య పెరిగిపోవడంతో నాటు సారా విక్రయదారులపై ప్రభావం పడింది. ఇంతకు ముందు వంద రూపాయలకు నాలుగు నాటుసారా ప్యాకెట్లు ఇచ్చేవారు..ఇప్పుడు తమ వ్యాపారం తగ్గిపోకూడదనే ఉద్దేశంతో ఐదు ప్యాకెట్లకు పెంచేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్న వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయాలు, ప్రార్ధనా మందిరాలు, పాఠశాలలకు 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. కొలిమిగుండ్లలో ఏర్పాటు చేసిన రెండు దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగానే నడుపుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. జాతీయ రహదారి చెంతనే ప్రార్థనా మందిరం, ఉన్నత పాఠశాల ఎదురుగానే ఓ మద్యం షాపు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. సెలవు దినాల్లో మద్యం కొనుగోలు చేసి పాఠశాలలోనే మందుబాబులు మద్యం సేవించే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మద్యం దుకాణానికి వంద మీటర్లలోపే పోలీస్ స్టేషన్ ఉంది. మరో దుకాణం జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో జాతీయ రహదారికి 130 మీటర్లలోపే ఉంది. ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు నాలుగు రోజుల క్రితం రెండు దుకాణాలను పరిశీలించినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగానే షాపులు ఏర్పాటై ఉండడంతో ఇతర ప్రాంతాలకు మార్చుకోవాలని నిర్వాహకులకు సూచినట్లు సమాచారం. అధికారుల ఆదేశాలు అమలు అవుతాయా లేదా అనేది వేచిచూడాలి.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడువు పెంచామని పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

బేతంచెర్ల: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సభ ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల తనిఖీ వివరాలను సామాజిక బృందం సభ్యులు వెల్లడిస్తారని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు.

సబ్ పోస్టాఫీస్ సందర్శన



ఉప తపాలా కార్యాలయం వద్ద కేజీబీవీ విద్యార్థినులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కస్తూర్బా ఉర్దూ బాలిక పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్‌లో వృత్తివిద్య అభ్యసిస్తున్న పది, ఇంటర్ విద్యార్థినులు స్థానిక సబ్‌పోస్టు ఆఫీస్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృత్తి విద్య ట్రెనర్ రేణుకాదేవి మాట్లాడుతూ.. వృత్తి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా సబ్ పోస్ట్ ఆఫీస్‌లో సేవలపై అవగాహన కల్పించామని తెలిపారు. వివిధ పథకాలు, సేవలను పోస్ట్‌మాస్టర్ రాఘురామ్ ప్రసాద్ విద్యార్థినులకు వివరించారు.

ప్రభుత్వ కార్యాలయాలను పార్టీ వేదికలుగా మార్చొద్దు

- ఆర్టీసీ డిపో ఆవరణలో ఫ్లెక్సీలపై ఉద్యోగుల అభ్యంతరం



డిపో ఆవరణలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

డోన్: ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలతో నింపి ఉద్యోగుల్లో విబేధాలను సృష్టించేందుకు టీడీపీకి చెందిన కొందరు ప్రయత్నిస్తున్నారని డోన్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నూతన బస్సు సర్వీసు ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు స్వాగతం పలికే ఫ్లెక్సీలను బస్టాండ్, డిపో ఆవరణలో ఏర్పాటు చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా ఎవరికి వారే రాజకీయ పార్టీల అభిమానులు ప్రభుత్వ కార్యాలయంలో ఫ్లెక్సీలు వేసుకుంటూపోతే కార్మికులు విధులు మానుకుని కొట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా తమ అనుమతితోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ వివరణ ఇచ్చారు.

మొక్కలే మానవాళికి రక్ష



స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కేవీకే శాస్త్రవేత్త

సంజామల: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియా అన్నారు. మంగళవారం సంజామల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు న్యూట్రిషన్ ఎడ్యూకేషన్, ప్లాంటేషన్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను గుర్తించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం కింద మండలంలో నిరక్షరాస్యులను గుర్తించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో వయోజన విద్య అమలుపై వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వీఓలు ఆయా గ్రామాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను గుర్తించాలని తెలిపారు. నవంబర్ నుంచి వయోజన విద్య కార్యక్రమం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతి మహిళా ఆర్థిక అక్షరాస్యత సాధించే విషయంలో విద్యపై పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వీఓలు చేపట్టాల్సిన సర్వే ఫారమ్స్ గురించి ఉల్లాస్-వయోజన విద్యాశాఖ జిల్లా పర్యవేక్షణాధికారులు ఆదినరసింహులు, సురేష్ సీసీలు, వీఓఏలకు అవగాహన కల్పించారు. ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



బనగానపల్లె: అప్పలాపురంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్



బేతంచెర్ల: ఎం.పెండేకల్లులో మాట్లాడుతున్న ఆర్డీఓ

బనగానపల్లెరూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పలాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గతంలో భూసర్వే జరిగిన గ్రామాల్లో రైతులు, గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని.. వాటి పరిష్కారం కోసం గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో 25 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేసినట్లు వెల్లడించారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్, సర్వేయర్ గీతాగాయత్రి, వీఆర్వో వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, మహనంది, అబ్దుల్లా పాల్గొన్నారు.

- సంజామల: మండల పరిధిలోని పేరుసోముల సచివాలయం పరిధిలోని దత్తాపురంలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ అనీల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను విచారించి పరిష్కరిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, సర్వేయర్ కృష్ణయ్య పాల్గొన్నారు.
- కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతుల నుంచి 27 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పొలాల విస్తీర్ణానికి సంబంధించి రికార్డుల్లో తేడాలు, భూసమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. బుధవారం మండలంలోని కంపమల్ల, 24న బిజనవేముల, 25న కలుగొట్ల గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్లు వీరన్న, శ్రీరాం, వీఆర్వోలు పుల్లయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.
- అవుకు: మండల పరిధిలోని అన్నవరంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సువర్ణాదేవి మాట్లాడుతూ.. రీసర్వేలో రైతులకు వచ్చిన సమస్యలను తెలియజేయాలని కోరారు. గ్రామంలో 35 వరకు అర్జీలు వచ్చాయని తెలిపారు. బుధవారం చెన్నంపల్లెలో గ్రామ సభ జరుగుతుందన్నారు. డీటీ మల్లికార్జునరెడ్డి, సర్వేయర్ హరి పాల్గొన్నారు.
- బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు గ్రామంలో ఆర్డీఓ మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, సర్పంచ్ ముచ్చు రామక్క ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. రీసర్వేలో ఏవైనా సమస్యలు ఉంటే రైతులు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో మొత్తం 109 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ నాగరాజు నాయక్, రీసర్వే డీటీ మహేశ్వర్‌రెడ్డి, వీఆర్వో వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు గిద్దలూరులో ఆధార్ క్యాంప్

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో బుధవారం ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ తెలిపారు. గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని సూచించారు.

'ఉపాధి'లో పండ్ల తోటల సాగు

ప్యాపిలి: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తోందని అంబుడ్స్‌మెన్ పర్సన్ సురేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం మొక్కల కొనుగోలుకు బిల్లులు మంజూరు చేస్తుందని తెలిపారు. అలాగే మొక్కలు పెంచుకునేందుకు రైతులకు నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీఓ వెంకటరమణ ఉన్నారు.

నేడు బీరవోలులో గ్రామ సభ

బనగానపల్లె: మండలంలోని బీరవోలు గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. రీసర్వేలో అభ్యంతరాలను అధికారు దృష్టికి తీసుకుని రావచ్చని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడువు పొడిగింపు

డోన్ రూరల్: డోన్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా ఉద్యోగాల దరఖాస్తుకు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె, కొలుములపల్లె గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఏఎస్ఐ వెంకట నారాయణ, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. గూటుపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న గుర్రమ్మ వద్ద 25 లీటర్లు, కొలుములపల్లెలో కురువ వంశీ, శేఖర్ వద్ద 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

డోన్ టౌన్: డోన్ ఆర్టీసీ డిపోకు నూతనంగా మంజూరైన ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ బస్సు డోన్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు మీదుగా ఆదోనికి వెళ్లి తిరిగి కర్నూలు మీదుగా డోన్, గుత్తి, అనంతపురంకు వెళ్లి వస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వేతనలు పెంచాలని వినతి

డోన్ రూరల్: డోన్ మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హస్‌లో డోన్ ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్, పెద్దస్వామిరెడ్డి, నాగరాజు, మురళీ ప్రభాకర్ ఉన్నారు.

బీసీలకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలి

డోన్ టౌన్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ తరహాలో బీసీలకూ శిక్షణ ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజుగౌడ్ కోరారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు వినతి

డోన్ టౌన్: రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఏపీలోనూ అమలు చేయాలని న్యాయవాది పులిదామోధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

విత్తనశుద్ధి కీలకం



మీర్జాపురంలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

కొలిమిగుండ్ల: రబీలో శనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని కోవెలకుంట్ల వ్యవసాయశాఖ ఏడీఏ సుధాకర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మీర్జాపురం, కొలిమిగుండ్ల గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనగ సాగు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. శుద్ధి చేసిన విత్తనం ద్వారా నేల నుంచి వ్యాపించే తెగులును అరికట్టవచ్చన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 44,373 హెక్టార్లకు విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 41,773 హెక్టార్లలో పంట సాగవుతుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ జ్యోతి, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

బేతంచెర్ల: కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది పంటలో గూడు పురుగు, మారుక మచ్చల పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కంది పంటలో అంతర పంటలు సాగు చేస్తే ఎండు తెగుళ్లను నివారించవచ్చని పేర్కొన్నారు. వెటర్నీ వైద్యుడు అజయ్ సన్న జీవాల్లో నట్టల నివారణపై అవగాహన కల్పించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, సీజనల్ వ్యాధులు నివారణ తదితర వాటిని వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులు తింటున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన క్రీడా మైదానం లేక విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకులు అస్లాం, మాబాషా, బబ్లూ, సన్నీ పాల్గొన్నారు.

మందులతో పొగాకు పంటను రక్షించుకోవచ్చు



కునుకుంట్లలో పంటను పరిశీలిస్తున్న ఏఓ

అవుకు: మండల పరిధిలో సాగు చేసిన పొగాకు పంటను మందులతో రక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. మంగళవారం కునుకుంట్ల, మన్నేనాయక్‌తండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పొగాకు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఇటీవల అధిక వర్షాలు కురవడంతో పొగాకు పంటలో ఆకు పసుపు రంగులోకి మారిందన్నారు. ముడుచుకోవడం, రాలిపోవడం, వాడిపోవడం జరుగుతోందని తెలిపారు. దీని నివారణకు ఒక లీటరు నీటిలో రిడొమిల్ గోల్డ్ ఒక గ్రాము లేదా 19.19.19, లేదా కేఎన్ఓ3 లేదా ఫార్ములా-4 5 గ్రాములు లేదా కార్బన్‌డిజైమ్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పొలంలో బాగా ఆరిన తర్వాత అమ్మోనియం సల్ఫేట్ ఒక ఎకరాకు 20 కేజీల చొప్పున చల్లుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష నమూనా పత్రాలను అందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



శింగనపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజారెడ్డి

అవుకు: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజా హెచ్చరించారు. మంగళవారం అవుకు మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ..గ్రామంలో మట్కా, పేకాట ఆడినా.. మద్యం సేవించి వాహనాలు నడిపినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో మహిళలు, బాలికలపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మండలంలోని ఎం.పెండేకల్లు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



తిమ్మాపురంలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

బనగానపల్లె: రైతులు అధిక దిగుబడికి.. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, సాంకేతిక పురోగతి గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం వరిలో అగ్గి తెగులు, దోమపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వాటి నివారణకు అవసరమైన మందులను సూచించారు. వరిలో ఎలుకల వల్ల జరిగే నష్టాన్ని అరికట్టేందుకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి పరమేశ్వరమ్మ పాల్గొన్నారు.